వేగుచుక్క

# తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ రైతులకు పట్టాలిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్.. ఇప్పుడు పారిశ్రామిక పార్కుల పేరిట వేలాది ఎకరాలు లాక్కుంటున్నారని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కనీసం ధాన్యం కూడా పూర్తిగా కొనలేకపోతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరిపోయే దీపం లాంటివారని ఎద్దేవా చేశారు. రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి చేశామని.. కానీ రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్ నిలదీశారు. ఉద్దండాపూర్ నుంచి గ్రావిటీ ద్వారా వికారాబాద్ జిల్లాకు కాల్వల ద్వారా నీటిని తీసుకురావచ్చని సిద్ధం చేస్తే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కమీషన్లు, కుటుంబ సంపాదన కోసం రూ. 440 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పక్కన పెట్టారని దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని.. రైతులకు పరిగితోపాటు కొడంగల్, జిల్లా మొత్తానికి సాగు నీరు అందించే బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పార్టీ నేతలు అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శివనోళ్ల భాస్కర్, రాజిరెడ్డి, సురేందర్, అశోక్‌కుమార్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులో చేపట్టబోయే పనులు ఇందులో ప్రతిబింబించాలని అన్నారు. ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ నర్సింహారెడ్డి, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై పోరాటంలో అందరూ భాగస్వాములే

**ఈ మహమ్మారిని తరిమి కొట్టడంలో కలసి రండి**

**ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు**



హైదరాబాద్, జూన్ 26 : సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులు అయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ / ఎక్స్-ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# వెనెజువెలాలో భూకంపం.. 920కి చేరిన మరణాలు

(మొదటిపేజీ తరువాయి)



వ్యక్తమవుతోంది. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. రాజధాని కారకాస్‌తో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భూప్రకంపనలు సంభవించినప్పటికీ, తీర ప్రాంత నగరమైన లా గువేరాలో అత్యధిక నష్టం వాటిల్లింది. భూకంపం ధాటికి అక్కడి పరిస్థితి దయనీయంగా మారింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల వివరాల ప్రకారం, లా గువేరాలో 100కు పైగా భవనాలు పూర్తిగా కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించడం, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టంగా మారిందని వారు తెలిపారు. భారీ కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా నేలమట్టమైనట్లు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విపత్తు సమయంలో తమ దేశానికి అండగా నిలిచిన ప్రపంచ దేశాలకు డెల్సీ రోడ్రిగ్స్ కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పథంతో సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్న అన్ని దేశాలకు వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రపంచ దేశాలు చూపుతున్న సంఘీభావం తమకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని ఆమె అన్నారు.భూకంపం అనంతరం సమాచార మార్పిడిని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. అత్యవసర సమాచారాన్ని ప్రజలకు త్వరగా చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలాలో 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024లో అప్పటి ప్రభుత్వం ఈ మైక్రోబ్లాగింగ్ వేదికపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, వెనెజువెలాకు అంతర్జాతీయంగా భారీగా సహాయం అందుతోంది. అమెరికా 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని పంపనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలు కూడా వైద్య బృందాలు, సహాయక సిబ్బంది, అత్యవసర సామగ్రిని పంపేందుకు ముందుకొచ్చాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని సజీవంగా రక్షించేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ప్రభుత్వం, బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది.

# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

(మొదటిపేజీ తరువాయి)

కల్పించను న్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీయూ-ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్‌ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చందనవెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ, ఫ్యాబ్ సిటీ ప్రాంతాలు కూడా డేటా సెంటర్ క్లస్టర్లుగా అభివృద్ధి చెందుతున్నాయి.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

- **ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**
- **జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం**



**హైదరాబాద్, జూన్ 26 :** తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు.సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకాను న్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# తెలంగాణకు భారీ వర్షసూచన

(మొదటిపేజీ తరువాయి)

సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40?50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




# ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేసిన తర్వాత బీఎల్‌వోలకు అందించాల్సి ఉంటుంది. ఎన్యూమరేషన్ ఫారంలు అందించిన రెండు, మూడు రోజుల తర్వాత బీఎల్‌వోలు మళ్లీ ఇంటింటికి వెళ్లి ఈ ఫారాలను స్వీకరిస్తారు. తెలుగులో కూడా ఈ పత్రాలు ఉంటాయి. దీంతో నిర్లక్ష్యరాస్యులు కూడా సులువుగా అర్థం చేసుకుని ఫారం నింపవచ్చు. ప్రతీ రోజు 50 ఇళ్లకు వెళ్లి బీఎల్‌వోలు ఈ దరఖాస్తులను అందించాల్సి ఉంటుంది. గడువు తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్‌వోలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు చూస్తున్నారు. ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికి బీఎల్‌వోలు అందించాలి. అనతరం ఓటర్లు వాటిని పూర్తి చేసి తిరిగి అందించాలి. బీఎల్‌వోలు తీసుకోకపోతే ఈసీ టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జులై 24వ తేదీలోపు వీటిని ఓటర్లందరూ అందించాల్సి ఉంటుంది. అయితే ఆఫ్‌లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా ఎన్యూమరేషన్ ఫారం నింపవచ్చు. ఈ విషయం చాలామందికి తెలియక ఆన్‌లైన్ సౌకర్యం ఉపయోగించుకోలేకపోతున్నారు. ఎమ్యూనరేషన్ పత్రాలను ఈసీ వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చు. మొబైల్ నెంబర్ ద్వారా ఓటీపీతో లాగిన్ అయ్యి సులువుగా ఫారం నింపవచ్చు. ఆఫ్‌లైన్ లేదా ఆన్లైన్.. ఈ రెండిటిల్లో ఏ విధానం ద్వారా అయినా సమర్పించవచ్చు.

# మొహర్రం వేడుకల్లో విషాదం

**విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి**

**భోపాల్,జూన్26 :** మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. మొహర్రం సందర్భంగా ఏర్పాటు చేసిన తజియా.. హైటెన్షన్ వైర్లకు తగలడం వల్ల విద్యుత్ షాక్‌తో ముగ్గురు మరణించారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ ఘటన రాట్లం జిల్లాలోని హత్నారా గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. హత్నారా గ్రామంలో శుక్రవారం మొహర్రం సందర్భంగా తజియా ఊరేగింపు జరిగింది. తజియా చాలా ఎత్తుగా ఉంది. ఈ తజియాతో మొహర్రం ఊరేగింపు నిర్వహిస్తుండగా పైన ఉన్న 11 కేవీ హైటెన్షన్ వైర్లను తగిలింది. తజియా పైభాగం ఆ వైర్లను తగలడం వల్ల దీన్ని తీసుకెళ్తున్న 12 మందికి విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనతో అక్కడ గందరగోళ, భయానక వాతావరణం ఏర్పడింది. ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు, స్థానిక అధికారులు విద్యుత్ షాక్‌కు గురైన 12 మందిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ముగ్గురు మరణించినట్లు వైద్యులు తెలిపారు. ముగ్గురు మృతులను రషీద్ ఖాన్, సద్దు హుస్సేన్, అర్బాజ్ ఖాన్‌గా గుర్తించారు. గాయపడ్డ తొమ్మిది మందికి రాట్లం మెడికల్ కాలేజీలో చికిత్స అందుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, ఈ ప్రమాదంపై స్థానిక ప్రజలు, ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తు?న్నారు. ప్రతి ఏడాది గ్రామంలో ఇదే మార్గంలో మొహర్రం తజియా వెళ్తుందని, ఈ సమయంలో విద్యుత్ అధికారులు విద్యుత్ నిలిపివేస్తారని, సిబ్బంది కూడా తమతోనే ఉంటారని చెప్పారు. ఈ ఏడాది కూడా విద్యుత్ సిబ్బంది తమతోనే ఉన్నారని, కానీ, విద్యుత్ సరఫరా నిలిపివేయలేదని, అందువల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా దీనిపై స్పందించారు. ప్రమాదకరమైన విద్యుత్ తీగలు గ్రామం మధ్య నుంచి వెళ్తున్నాయని, అందులోనూ అవి చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయని విమర్శిస్తున్నారు. కొన్నిసార్లు బస్సులు, ఇతర వాహనాలు వెళ్లేందుకు కూడా వీటివల్ల ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

# విప్లవోద్యమ మార్గదర్శి డివి. కృష్ణ.

## -సీపీఐ (ఎం ఎల్)మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్.



**వేగుచుక్క న్యూస్,ఆర్మూర్:**

విప్లవోద్యమ మార్గదర్శి డివి. కృష్ణ అని, ఆయన జీవితాంతం ప్రజల కోసం పని చేసిన గొప్ప త్యాగశీలి అని సీపీఐ (ఎం ఎల్)మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి ప్రభాకర్‌లి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో కుమార్ నారాయణ భవన్ ముందు గల డివి. కృష్ణ విగ్రహంకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా, డివిజన్ నాయకులు బి దేవరాం, ఎస్ సురేష్, జి కిషన్, కె రాజేశ్వర్, వి సత్తేవ్వ, బి కిషన్, ఎం నరేందర్ పూలమాలలతో నివాళు లు అర్పించారు. పార్టీ కార్యాలయం ముందు గల ఎర్రజెండాను పార్టీ జిల్లా కార్యదర్శి వి ప్రభాకర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి సభకు ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి. దేవారం అధ్యక్షత వహించగా, వి ప్రభాకర్ మాట్లాడారు. విప్లవోద్యమ కార్యనిర్వహనలో భాగంగా గుంటూరు నుంచి ఇందూరుకు వచ్చి పల్లె పల్లెల్లో ఉద్యమాన్ని విస్తరించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలి, ప్రజల కోసం పోరాడారని గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన వీర యోధుడనీ అన్నారు. ఎమర్జెన్సీ సమయములో తోటి సహచరులంతా బూటకపు ఎన్కౌంటర్లలో అమరత్వం పొందుతుంటే గుండె జారకుండా నిలబడి పార్టీ నాయకులకు శ్రేణులకు మనోధైర్యం ఇచ్చి ముందుకు నడపాడని అన్నారు. పల్లెల్లో బానిసత్వం పెరిగిన సమయంలో, అరాచకాలు విస్తృతంగా సాగుతున్న సమయంలో వాటికి వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించి పోరాడి భూములను ప్రజలకు పంచినవిప్లవ నాయకుడు అన్నారు. కార్మికుల రైతాంగ విద్యార్థి యువజన పోరాటంలో సమీకరించి, ప్రజా సంఘాల నిర్మించిన గొప్ప నాయకుడు అన్నారు. జిల్లాలో బీడీ రంగంలో కార్మికుల నిరక్షరాస్యతను తొలగించి, రాత్రి పాఠశాల నిర్వహించి వారికి కార్మిక పోరాటాలు నిర్మించి కార్మిక సంఘాన్ని స్థాపించిన గొప్ప కార్మిక నాయకుడు అన్నారు. డివి కృష్ణ స్ఫూర్తిని అందరం

పునికి పుచ్చుకొని బలమైన విప్లవోద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎం ముత్తేన్న, సీనియర్ జర్నలిస్ట్ కొంగర శ్రీనివాస్ లు ప్రసంగించగా జిల్లా, డివిజన్ మండల నాయకులు డివిజన్ కార్యదర్శి బి దేవరాం, ఎస్ సురేష్, జి కిషన్, కె రాజేశ్వర్, వి సత్తేవ్వ, బి కిషన్, ఎం నరేందర్, యు రాజన్న, జి నడిపేన్న, జి అరవింద్ , ఎస్ దుర్గాప్రసాద్, ఎం లక్ష్మి జి పద్మా ఎన్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



# సెలవుల్లో క్లాసులు నడిపితే సహించేది లేదు.

## ఏబీవీపీ నాయకుల హెచ్చరిక.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:**

ప్రభుత్వ సెలవు దినాల్లో నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) డిమాండ్ చేసింది. శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ నిజామాబాద్ నగరంలోని ఆల్ ఫోర్స్, ఎస్సార్, బన్సల్ తదితర ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల్లో యథేచ్ఛగా తరగతులు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ ఇందూరు నాయకులు ఆయా కళాశాలలకు చేరుకుని, యాజమాన్యాల తీరును నిరసిస్తూ క్లాసులను బలవంతంగా బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ క్షైరి శశీధర్ మాట్లాడుతూ, లాభార్జనే ధ్యేయంగా కార్పొరేట్ సంస్థలు విద్యా చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని మండిపడ్డారు. కనీసం సెలవు రోజుల్లో కూడా విశ్రాంతి లేకుండా తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) ఈ వ్యవహారంపై వెంటనే స్పందించాలని, నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెడితే ఏబీవీపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బాలకృష్ణ, దుర్గ దాస్, గుడ్డు, వీరేష్, నిఖిల్, రాజు, సోరబ్, రాజేష్, కార్తీక్, దినేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి.

**ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లో అమలయ్యేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి.**

**హెచ్‌యూజే (టీడబ్ల్యూజేఎఫ్?) కార్యవర్గం డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్:**



జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్?యూజే - టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరింది. శుక్రవారం హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హెచ్ యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్ అధ్యక్షతన ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలపై నాయకులు కూలంకుషంగా చర్చించారు. జర్నలిస్టులకు ఇండ్ల జాగాల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని తెలిపింది. ఇండ్ల స్థలాలకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం జాప్యం చేయకుండా నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని కోరింది. న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు న్యాయం చేసేలా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యచికిత్సలు అందేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికి హెచ్?యూజే నాయకులు కృషి చేయాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాటి పరిష్కారం కోసం హెచ్ యూజే కార్యాచరణను రూపొందించాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లాలని సూచించారు.

హెచ్?యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బి జగదీశ్వర్ మాట్లాడుతూ సంఘం కార్యక్రమాలను వివరించారు. హెచ్ యూజే సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తిచేసి ఆగస్టు చివరి వారంలో సంఘం మహాసభ నిర్వహిస్తామని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్ , కోశాధికారి బి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాలు మాత్రమే చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని అన్నారు. నియోజకవర్గ మహాసభలు పూర్తి చేసుకుని ఆగస్టు చివరి నాటికి హెచ్ యూజే మహాసభ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ యూజే ఆఫీస్ బేరర్లు సర్వేశ్వరరావు, మధుకర్, ప్రశాంత్, రేణయ్య, మాధవ రెడ్డి, తలారి శ్రీనివాస్, వి సాగర్, జె క్రాంతి, పి విజయ, శ్రీధర్ మురహరి, రాము తదితరులు పాల్గొన్నారు.




# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం.



**పోలీస్ కమీషనర్ పిలుపు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు ల ఆధ్వర్యంలో 2 కే రన్. సే నో టు డ్రగ్స్ సే ఇస్ టు లైఫ్ అని నినదించిన విద్యార్థులు.**





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని , యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం అందరి బాధ్యత అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య అన్నారు. శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మరియు ఐఎంఏ డాక్టర్స్ సహకారంతో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమం నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిధి మాట్లాడుతూ, చిన్న చిన్న మంచి అలవాట్లతోనే సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. డ్రగ్స్ సమస్య కొత్తది కాదని , దేశాన్ని బలహీనపర్చేందుకు శత్రు దేశాలు యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాప్తిని ప్రోత్సహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశ బలం యువతేనని , వారిని మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చే కుట్రలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని , సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు వెచ్చిస్తున్నాయని , ఈ సమస్య లేకుంటే ఆ నిధులను విద్య వంటి అభివృద్ధి రంగాలకు వినియోగించే అవకాశం ఉండేదని చెప్పారు. రానున్న రెండు నుంచి మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలలు , ఇంటర్మీడియట్ కళాశాలలు , ప్రొఫెషనల్ కళాశాలల్లో విస్తృత స్థాయిలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ “సే నో టూ డ్రగ్స్ సే ఎస్ టూ లైఫ్ అనే సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని కృషి చేయాలని పోలీస్ కమీషనర్ పిలుపునిచ్చారు.

**డాక్టర్ కవిత రెడ్డి మాట్లాడుతూ ,**

రాష్ట్ర ముఖ్యమంత్రి డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. పోలీస్ శాఖలో ఈగల్ (జూగా+టాజు) బృందం డ్రగ్స్ నియంత్రణ కోసం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. డ్రగ్స్ నియంత్రణ కోసము పోలీస్ కళాబృందం చేసిన నాటిక విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది.

2కె రన్ కార్యక్రమము పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించిన అనంతరం జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుండి ప్రారంభమై - రైల్వే కమాన్ - పోలీస్ పరేడ్ గ్రౌండ్ - ఎన్టీఆర్ చౌరస్తా - ఆర్ అండ్ బి ఆఫీస్ - రైల్వే స్టేషన్ - జిల్లా ఫైర్ స్టేషన్ - పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , జిల్లా ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ ఐశ్వర్య , ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ విశాల్ , నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లు దర్శన్ సింగ్ , హితేన్ బిమాని , కాకతీయ రజనీకాంత్ , శ్రీనివాస్ రెడ్డి , డి వై ఎస్ ఓ పవన్ కుమార్ , ట్రాఫిక్ ఏసీపీ శ్రీ మస్తాన్ అలీ , సీఐలు , ఎస్. ఐ లు పోలీసు సిబ్బంది , వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థులు, ప్రతినిధులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# “ఇడుపు కాయితం” ...

## తెలంగాణ పై ఇంకా ఎందుకంత ఓర్వలేనితనం.

పన్నెండు ఏండ్లు
అయ్యింది ఇడుపు
కాయితం అయి ..
అయినా అదే ఏడుపు.
మా భాష మీద ...
మా యాష మీద ...

ఏరువడ్డంక ఎవని
బతుకు ఆనిదే.. కానీ ...
ఈడ ఇంకా మా మీదనే
ఏడుపులు.

పత్రికా రంగం లో వాళ్ళే
24 ఫ్రేమ్స్ సినిమా
రంగంలో వాళ్ళే...

లైట్ బాయిలు, స్వీపర్లకే
మమ్మల్ని కట్టిపడేసింఢ్రు
ఇంకనైనా మా
బతుకులు మమ్మల్ని
బతకనియ్యరా ...??

ఈడ ....
తమిళులు ఉన్నరు
బీహారీలు ఉన్నరు
మార్వాడీలు ఉన్నరు
మలయాళీలు ఉన్నరు.

కానీ ....
ఒక్క మీతోనే ఏంది
మాకు ఈ పంచాయితీ
... ??

మీ కోడి పందాల్లో వాటా
అడిగినమా ...?
మీ పెద్దాపురం
యాపారంలో వాటా
కావాలన్నమా ..?
మీ భోగం మేళం
యాపారంలో లాభాలు
ఇమ్మన్నమా ...?

మీ బతుకులు వేరు
మా బతుకులు వేరు
మీ ఆలోచన వేరు
మా ఆలోచన వేరు.
మనమెన్నడు ఒకటి కాదు
ఒకట్టైతే ...
అసలు ఏరే
పడకపోదుము ...

(ఇడుపు) కాయితం...
సినిమా టైటిల్ పై
యాసను అవమానిస్తూ..
సోషల్ మీడియాలో
కొంతమంది ఆంధ్రా
అహంకారపు ధోరణిపై
తెలంగాణ ప్రజానీకం
నుండి వెల్లువెత్తిన
ఆగ్రహం.)

## స్వేచ్ఛ అంటే బట్టలు కాదు..

## అభిప్రాయానికి విలువ రావాలి:

# సునీత

హైదరాబాద్, జూన్ 25

ప్రముఖ నేపథ్య గాయని సునీత ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మహిళల స్వేచ్ఛ, వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత వంటి అంశాలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాల్లో చూపిస్తున్నామని దర్శక నిర్మాతలు చెప్పే వాదనను ఆమె ప్రశ్నించారు. కమర్షియల్ సినిమా అయినా, ఇతర రకాల సినిమాలు అయినా సమాజం పట్ల కొంత బాధ్యతతో ఉండాలని సునీత అభిప్రాయపడ్డారు. సమాజంలో కనిపించే ప్రతిదాన్ని యథాతథంగా చూపించడం మాత్రమే కళాత్మక స్వేచ్ఛ కాదని, దానికి ఒక దిశా నిర్దేశం, బాధ్యత కూడా ఉండాలని ఆమె సూచించారు. మహిళల స్వేచ్ఛ పేరుతో ఇటీవలి కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న "నా శరీరం.. నా ఇష్టం" అనే నినాదంపై కూడా సునీత ప్రాయోగిక కోణంలో స్పందించారు. అమ్మాయిలు తమకు నచ్చిన బట్టలు వేసుకోవడం వారి ఇష్టమే అయినప్పటికీ, దానిని సమాజంలో పూర్తిస్థాయి స్వేచ్ఛగా నిర్వచించడం సరైన కోణం కాదని ఆమె అన్నారు. ఎవరి ఇష్టం వారిదే అయినా, చుట్టూ ఉన్న పరిస్థితులు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో కూడా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేవలం బట్టలు, అలవాట్లు లేదా బయటి ప్రవర్తనతో సమానత్వాన్ని కొలవడం తగదని, నిజమైన సమానత్వం అంటే ఒక మహిళ తన అభిప్రాయం చెప్పినప్పుడు దానికి సమాజం, కుటుంబం, ముఖ్యంగా పురుషులు ఎంత గౌరవం ఇస్తున్నారన్నదే అసలు ప్రశ్న అని సునీత అభిప్రాయపడ్డారు. సినిమాల్లో మహిళా పాత్రల చిత్రీకరణ, మహిళల వ్యక్తిగత నిర్ణయాల గురించి కూడా సునీత పరోక్షంగా ప్రస్తావించారు. అవును అనాలా, వద్దనాలా అనేది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయమని, ఎవరిపైనా బలవంతం ఉండకూడదని ఆమె స్పష్టం చేశారు. ఈ చర్చ కేవలం సినిమా రంగానికి మాత్రమే పరిమితం కాదని, సమాజంలో ఉన్న ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ ఎదుర్కొనే వాస్తవ పరిస్థితుల గురించే తాను మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. మహిళల స్వేచ్ఛ అనేది బాహ్య ప్రదర్శనలో కాకుండా, వారి మాటకు విలువ రావడంలో, వారి నిర్ణయాలను గౌరవించడంలో ఉండాలని సునీత చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం విస్తృత చర్చకు దారితీశాయి.



## 'మా ఇంటి బంగారం'కు ఆరు రోజుల్లో

# రూ.55.71 కోట్ల వసూళ్లు

హైదరాబాద్, జూన్ 25

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విడుదలైన తొలి వారంలోనే ఈ సినిమా అద్భుతమైన వసూళ్లు నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ. 55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. దేశీయంగా రూ. 33.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేయగా, ఇండియా గ్రాస్ వసూళ్లు రూ. 38.36 కోట్లకు చేరుకున్నాయి. విడుదలైన ఆరో రోజున కూడా సినిమా మంచి వసూళ్లు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్ర జోరు కొనసాగుతోంది. విదేశీ మార్కెట్లలోనూ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఇప్పటి వరకు ఓవర్సీస్‌లో ఈ చిత్రం రూ. 17.35 కోట్ల గ్రాస్‌వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ రిపోర్టులు సూచిస్తున్నాయి. ఆరో రోజున ఒక్క రోజులోనే విదేశీ మార్కెట్ల నుంచి రూ.కోటికి పైగా వసూళ్లు రావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూకే మార్కెట్లలో సినిమాకు మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది.






## తెలుగు, తమిళ సినిమాల్లో దూసుకెళ్తున్న

# యువ నటి అనైరా గుప్తా

హైదరాబాద్, జూన్ 25

తెలుగు, తమిళ చిత్రసీమల్లో తన అందం, అభినయంతో ఆకట్టుకుంటున్న యువ నటి అనైరా గుప్తా దక్షిణాది సినిమా పరిశ్రమలో వేగంగా గుర్తింపు సంపాదిస్తోంది. తొలి అవకాశాలను సమర్థంగా ఉపయోగించుకుంటూ వరుస ప్రాజెక్టులతో బిజీగా మారిన ఆమె, ప్రస్తుతం పలు ఆసక్తికరమైన సినిమాల్లో నటిస్తోంది. 2018లో విడుదలైన 'హుషారు' చిత్రంలో సహాయ పాత్రతో సినీ రంగ ప్రవేశం చేసిన అనైరా గుప్తా, తన స్క్రీన్ ప్రజెన్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అనం తరం విజయ్ నటించిన 'సర్కార్' చిత్రంలోని ప్రముఖ పాట 'సిమ్టాంగారన్'లో కనిపించి మరింత గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత వితైక్కారన్, అన్వేషిలివంటి సినిమాల్లో నటిస్తూ తన నటనకు మంచి ప్రశంసలు అందుకుంది. గ్లామర్‌తో పాటు సహజమైన అబి,నయంతో విభిన్న పాత్రల్లో తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం అనైరా గుప్తా నటిస్తున్న ప్రాజెక్టుల్లో తమిళ చిత్రం 'కొంబుసీవి' ఒకటి. ఈ చిత్రానికి పొన్రామ్ దర్శకత్వం వహి స్తున్నారు. అలాగే తెలుగు సినిమా 'పురుషహ'లో "దేవనాయకి" పేరుతో రూపొం దుతున్న ప్రత్యేక గీతంలో కూడా ఆమె కనిపించనుంది. వరుస అవకాశాలతో దక్షిణాది చిత్రసీమలో తన స్థానం మరింత బలపడుతుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తానికి, తెలుగు-తమిళ ఇండ స్ట్రీల్లో కొత్త తరం నటీమణుల్లో అనైరా గుప్తా పేరు వేగంగావినిపిస్తూ, భవిష్యత్తులో మరిన్ని కీలక పాత్రల తో మరింత గుర్తిం పుసాధించే దిశగా ముందుకు సాగుతోంది.




## ప్రియదర్శి 'ఇడుపు కాయితం'

# ప్రారంభం

హైదరాబాద్, జూన్ 24

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో, తెలంగాణ జానపద గీతాలతో విశేష ఆదరణ పొందిన నాట్య కళాకారిణి నాగదుర్గ కథానాయికగా ఓ సరికొత్త చిత్రం ప్రారంభమైంది. ఈ చిత్రానికి 'ఇడుపు కాయితం' అనే ఆసక్తికరమైన శీర్షికను ఖరారు చేశారు. తెలంగాణ వాడుక భాషలో 'ఇడుపు కాయితం' అంటే విడాకులు అనే అర్థం వస్తుంది. నేడు ఘనంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ముఖ్య అతిథిగా హాజరై, సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలుగు చిత్రసీమలో విజయవంతమైన చిత్రాలకు గుర్తింపుగా నిలిచిన సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సుకుమార్ సమర్పణలో, బన్నీ వాస్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుపై ప్రారంభ దశలోనే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తుండగా, సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. "మన మూలాల సువాసన.. ప్రతి ఇంటి కథ" అనే భావంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే కుటుంబ కథగా రూపుదిద్దుకోనుంది. భార్యాభర్తల అనుబంధం, కుటుంబ బంధాలు, భావోద్వేగాల కలయికగా అచ్చమైన పల్లెటూరి జీవనశైలిని ప్రతిబింబించేలా ఈ సినిమా రూపొందనుంది. తెలంగాణ జానపద పాటలు, ప్రైవేట్ ఆల్బమ్‌ల ద్వారా తన నాట్యాభినయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఈ సినిమాతో కథానాయికగా మరింత గుర్తింపు పొందాలని ఆశిస్తోంది. పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనుంది.



## బాక్సాఫీస్‌లో జోరు కొనసాగిస్తున్న

# మీనాక్షి చౌదరి..

హైదరాబాద్, జూన్ 25

ప్రస్తుతం తెలుగు చిత్రసీమలో అత్యంత డిమాండ్ ఉన్న హీరోయిన్లలో మీనాక్షి చౌదరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల ఆమె నటించిన సినిమాలన్నీ వరుసగా విజయం సాధిస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతున్నాయి. దీంతో టాలీవుడ్‌లో ఆమె క్రేజ్ మరింత పెరిగింది. 2024లో విడుదలైన 'లక్కీ భాస్కర్' సినిమా వంద కోట్లకు పైగా వసూళు సాధించి మంచి విజయాన్ని నమోదు చేసింది. అనంతరం వెంకటేష్‌తో కలిసి నటించిన 'సంక్రాం తికి వస్తున్నాం' చిత్రం ఏకంగా రూ.350 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి సంచలనం సృష్టించింది. ఈ విజయాలతో మీనాక్షి కెరీర్‌లో ఇది ఇప్పటి వరకు అత్యంత పెద్ద హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో విడుదలైన 'అనగనగా ఒక రాజు' చిత్రం కూడా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి మరో విజయాన్ని ఆమె ఖాతాలో వేసింది. వరుస విజయాలతో మీనాక్షి చౌదరి టాలీ వుడ్‌లో బ్యాంకబుల్ హీరోయిన్‌గా మారిపోయిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక ప్రస్తుతం ఆమె అక్కినేని నాగార్జునతో కలిసి నటిస్తున్న కొత్త చిత్రం 'వృషకర్మ' షూటింగ్‌లో బిజీగా ఉంది. హారర్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమాను 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ మధ్యలో మీనాక్షి ఇటీవల నేపాల్ వెకేషన్‌కు వెళ్లి అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించింది. ఆ క్షణాలను ఫోటోల రూపంలో సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలు, క్రేజీ ప్రాజెక్టులతో మీనాక్షి చౌదరి టాలీ వుడ్‌లో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.